క్లుప్తంగా

వైభవంగా వారాహిదేవి నవరాత్రి ఉత్సవాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వారాహిదేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీలలితాంబికా పీఠంలో వేడుకల్లో భాగాంగా అమ్మవారికి శనివారం పంచామృత అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. శనివారం ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకాలు, అలంకరణ అనంతరం సామూహిక కుంకుమార్చనలు చేపట్టారు. అమ్మవారికి పీఠాధీశ్వరి శివలీల మాతాశ్రీ పూజా కార్యక్రమాలను, సాయంత్రం పీఠం ఆవరణలోని యాగశాలలో హోమాలను నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

రిటైర్డ్ హోంగార్డుకు ఆర్థిక చేయూత



విజయవాడస్పోర్ట్స్: విజయవాడ నగర హోంగార్డ్స్ యూనిట్ నందు హోంగార్డుగా విధులు నిర్వర్తించి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన కర్రే మల్లీశ్వరికి ఎన్టీఆర్ జిల్లా పోలీస్‌కమిషనర్ టి.కె.రాణా రూ.5 లక్షలను అందజేశారు. మల్లీశ్వరి కుటుంబానికి ఆర్థిక చేయూతనందించేందుకు జిల్లాలో పని చేస్తున్న హోం గార్డులు వారి ఒక్క రోజు వేతనాన్ని సాయంగా అందజేశారు. ఈ నగదు చెక్కును కమిషనరేట్‌లో సీపీ రాణా చేతుల మీదుగా మల్లీశ్వరికి శనివారం అందించారు. అడ్మిన్‌డీసీపీ మోకా సత్తిబాబు, హోంగార్డు ఆర్ఐ కృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ డెప్యూటీ ఈఈల బదిలీ

ఏలూరు(ఆర్ఆర్‌పేట): తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఈపీడీసీఎల్) ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న పలువురు డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను బదిలీ చేస్తూ ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నిడదవోలు కన్‌స్ట్రక్షన్స్ విభాగంలో పనిచేస్తున్న వి.సునీతను విజయవాడ ఎల్ఎంసీ/ఎస్ఎల్‌డీసీకి బదిలీ చేశారు. విజయవాడ ఎల్ఎంసీ/ఎస్ఎల్‌డీసీలో పనిచేస్తున్న యు.సూర్యకళను తాడేపల్లిగూడెం హెచ్‌టీ మీటర్స్–2కు, విజయవాడ ఏపీపీసీసీలో పని చేస్తున్న చైతన్య వర్మను నిడదవోలు కన్‌స్ట్రక్షన్స్‌కు బదిలీ చేశారు.

ఎటపాక మండలంలో నిర్వాసిత గ్రామాలు గుర్తించాలి

సాక్షి, అమరావతి: ఎటపాక మండలంలో వరద తాకిడికి గురైన అన్ని గ్రామాలను నిర్వాసిత గ్రామాలుగా గుర్తించి నష్టపరిహారం, ఆర్అండ్ఆర్ ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శనివారం రాసిన లేఖను శ్రీనివాసరావు మీడియాకు విడుదల చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలంలో తాను ఈ నెల 20, 21 తేదీల్లో పాదయాత్ర చేసిన సందర్భంలో ఆ ప్రాంత వాసులు ముంపు సమస్యను ప్రస్తావించారన్నారు. 87 గ్రామాలకుపైగా వరదతో పాటు పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వలన ముంపునకు గురవుతున్నాయని పేర్కొన్నారు. కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా ఎటపాక మండలంలో వరద తాకిడికి గురైన అన్ని గ్రామాలను నిర్వాసిత గ్రామాలుగా గుర్తించి నష్టపరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజ్ ప్రకారం డబ్బులు చెల్లించి, ముంపు లేని చోట ఇళ్లు కట్టించి ఇవ్వాలని శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు.

ముస్లిం మైనార్టీలను టీడీపీ మోసం చేసింది



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముస్లిం మైనార్టీలను టీడీపీ దారుణంగా మోసం చేసిందని ఏపీ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ వాజిద్‌ఖాన్ అన్నారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ నేత ఎండీ మొహమూద్ ఆధ్వర్యంలో 'హర్ దిల్ మే వైఎస్సార్– హమ్ సబ్ జగన్ కే సాత్' కార్యక్రమాన్ని రైల్వేస్టేషన్ సమీపంలో కేరళ సున్నిమసీదులో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన వాజిద్‌ఖాన్ మాట్లాడుతూ.. మైనార్టీల సంక్షేమానికి గతంలో ఎన్నడూ లేనివిధంగా జగన్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. ప్రభుత్వం మైనార్టీలకు అండగా నిలిచిందన్నారు. నాయకులు చాన్, బాషా, సలావుద్దీన్, మసీదు అధ్యక్ష, కార్యదర్శులు మోహినిదీన్, మొహమ్మద్ పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై వలంటీర్లు అవగాహన కల్పించాలి

మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మొబైల్ యాప్‌లో వలంటీర్ నమోదు చేస్తున్న వివరాలను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): వలంటీర్లు తమ క్లస్టర్ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి 'జగనన్న సురక్ష' కార్యక్రమంపై అవగాహన కల్పించి, ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్స్ ఇప్పించేందుకు కృషి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. 34వ డివిజన్ పరిధిలోని కేదారేశ్వరపేట, సీడబ్ల్యూసీ గోడౌన్ ప్రాంతంలోని 6వ రోడ్డులో గల సచివాలయ సిబ్బంది 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ఏ విధంగా నిర్వహిస్తున్నారో తెలుసుకునేందుకు ఆయన శనివారం అదనపు కమిషనర్లు(జనరల్, ప్రాజెక్ట్స్) ఎం.శ్యామల, కేవీ సత్యవతితో కలిసి పర్యటించారు.

ఈ సందర్భంగా కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆ ఇంట్లో వారు అర్హత ఉండి కూడా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎందుకు పొందలేక పోతున్నారో క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అటువంటి వారిని గుర్తించి పథకాల వర్తింపునకు అవసరమైన సర్టిఫికెట్స్ వారి వద్ద లేకపోతే దరఖాస్తు చేయించాలని సూచించారు. అలాగే ప్రభుత్వం మంజూరు చేస్తున్న సర్టిఫికెట్స్ అవసరమైన వారి చేత దరఖాస్తు చేయించి ఉచితంగా అందించాలన్నారు. ప్రజల దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి సర్టిఫికెట్స్‌ను సిద్ధం చేయించి, మీ ఏరియా పరిధిలో మీకు కేటాయించిన తేదీలో జరిగే క్యాంప్‌కు వారిని ఆహ్వానించి అందజేయాలని ఆదేశించారు. ప్రతి ఇంటికీ వెళ్లి యజమానితో మాట్లాడిన తరువాత వారి ఫొటో కచ్చితంగా అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణమూర్తి, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

ప్రైవేటు ఆస్పత్రుల్లో డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీలు



ప్రైవేటు ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. నిబంధనలు పాటించని ఆస్పత్రులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆమె శనివారం నగరంలోని పలు ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నోటిఫై చేసిన అంటు వ్యాధుల నమోదుకు సంబంధించి ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫామ్(ఐహెచ్ఐపీ) వెబ్ పోర్టల్‌ను పరిశీలించారు. ఓపీ విభాగం, ఇతర సేవలకు వసూలు చేస్తున్న ఫీజుల పట్టిక ప్రదర్శన, సిబ్బంది వివరాలు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ప్రదర్శన, పీసీపీఎన్‌డీటీ చట్టం అమలు, ప్రైవేటు లేబొరేటరీస్ ఆచరించాల్సిన నియమ నిబంధనలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేటు ఆస్పత్రిల యాజమాన్యాలు విధిగా ఐహెచ్ఐపీ పోర్టల్‌లో నోటిఫై చేసిన వ్యాధులను నమోదు చేయాలని, నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో ఏపిడిమియాలజిస్ట్ డాక్టర్ సమీర పాల్గొన్నారు.

'ఉపా' చట్టాన్ని రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చిలకా చంద్రశేఖర్ తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(ఉ.పా.)ను తక్షణమే రద్దు చేయాలని ఉ.పా. రద్దు పోరాట కమిటీ కన్వీనర్ చిలుకా చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో ఉ.పా. రద్దు పోరాట కమిటీ ఆధ్వర్యంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రశ్నించే ప్రజాస్వామిక వాదులపై ఉ.పా. కేసులు పెట్టి ఏళ్ల తరబడి జైళ్లలో నిర్బంధిస్తున్నారన్నారు. 2018వ సంవత్సరంలో ప్రధాని నరేంద్రమోదీని హత్య చేయడానికి కుట్రపన్నారని భీమాకోరేగావ్ కుట్ర కేసు నమోదు చేసి దేశంలోని 16 మంది ప్రజాస్వామిక వాదులపై కేసు నమోదు చేశారన్నారు. ఆ కేసులో ప్రజాస్వామిక వాదులను ఐదేళ్లుగా జైళ్లలో నిర్బంధించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉ.పా. చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సి.భాస్కర్ రావు(ఓపీడీఆర్), దుడ్డు ప్రభాకర్ (కెఎన్‌పీఎస్), రాధ(సీఎంఎస్) కొండారెడ్డి(పీకేఎస్), వెంకటేశ్వర్లు(పీడీఎం), అరసవిల్లి కృష్ణ (విరసం), పోలారి, ఎ.రవిచంద్ర, కోటి(ప్రజాకళామండలి) తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలోనే విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతి



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న శ్రీకాంత్, గోవర్ధన్ శాస్త్రి తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతి సాధ్యమైందని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ అన్నారు. రాష్ట్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయాలకు జీఓ నంబర్ 665 ద్వారా ధూపదీప నైవేద్య పథకం(డీడీఎన్) వర్తింప చేస్తూ రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేయడంపై శనివారం హర్షం వ్యక్తం చేశారు. విజయవాడ గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

ప్రభుత్వానికి ధన్యావాదాలు

ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి డీడీఎన్ పథకాన్ని వర్తింప చేయటం అభినందనీయమన్నారు. రాష్ట్ర విశ్వబ్రాహ్మణ పురోహిత పరిషత్ అధ్యక్షుడు ఆరికట్ల గోవర్ధన్ శాస్త్రి మాట్లాడుతూ సీఎం జగన్ నిర్ణయాన్ని యావత్ వీరబ్రహ్మేంద్ర స్వామి భక్తులు స్వాగతిస్తూ సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారన్నారు. కుల మతాలకు అతీతంగా భక్తులు రాష్ట్రంలో అనేక చోట్ల వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాలను నిర్మించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ పురోహిత పరిషత్ కార్యాలయ కార్యదర్శి ఇదుమకంటి జనార్దన శాస్త్రి, కృష్ణాజిల్లా కార్యదర్శి రామడుగు వాసు శర్మ, మూర్తి మధుబాబు, బంగారు కల్యాణ్‌చారి, కపిలేశ్వరపు వెంకట నాగమణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి, ఎండోమెంట్ కమిషనర్ సత్యనారాయణకు ధన్యవాదాలు తెలిపారు.

హజ్ హౌస్‌పై టీడీపీ మాట్లాడటం సిగ్గు చేటు



మాట్లాడుతున్న గౌస్‌మొహిద్దీన్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): హజ్ హౌస్, హజ్ యాత్రికుల గురించి తెలుగుదేశం పార్టీ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని వక్ఫ్‌బోర్డు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గౌస్‌మొహిద్దీన్ ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ నేత జలీల్‌ఖాన్ హజ్ హౌస్ నిర్మాణం, హాజీల గురించి తమ ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ మాట్లాడటాన్ని ఖండించారు. టీడీపీ పాలనలో 2018 మే18న హజ్ హౌస్‌కి శంకుస్థాపన చేసి, రూ.80 కోట్లతో నిర్మాణం చేస్తామంటూ ఆర్భాటపు ప్రకటనలు చేసి, ఆ తరువాత దానిని పట్టించుకోలేదని దుయ్యబట్టారు. కనీసం నిర్మాణపు పనులకు నిధులు విడుదల చేయకుండా మోసం చేసిన విషయం ముస్లిం మైనార్టీలకు తెలుసన్నారు. గత పాలనలో హాజీలు పొరుగు రాష్ట్రం తెలంగాణ హైదరాబాద్ నుండి హజ్ యాత్రకు వెళ్తుంటే కనీసం పట్టించుకున్న పాపాన పోని మీకు మాట్లాడే అర్హత లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చొరవతో హాజీలకు ఇబ్బంది లేకుండా విజయవాడ నుంచే హజ్ యాత్రకు వెళ్లేటందుకు, ప్రభుత్వం గన్నవరం విమానాశ్రయానికి ఎంబర్కేషన్ పాయింట్ తీసుకురావడమే కాకుండా, వారిపై పడిన అదనపు భారం ఒక్కొక్కరికీ రూ.80 వేల చొప్పున రూ.14.51 కోట్లు ప్రభుత్వమే భరించిందని చెప్పారు. టీడీపీ నేతలు మైనార్టీ పక్షపాత జగన్ ప్రభుత్వాన్ని విమర్శించడం మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో జిల్లా వక్ఫ్ బోర్డు సహాయ కార్యదర్శి ఎంపీ ఎండీ నజీర్, నాయకులు షేక్ బడేమియా, షేక్ ఇక్బాల్, షేక్ యాసిన్, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

టీటీడీపై విమర్శలు తగదు

ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు



తిరుమలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి

తిరుమల: చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్ సిగ్గు లేకుండా టీటీడీపై విమర్శలు చేయడం తగదని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆయన శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. గతంలో బినామీలతో దర్శనాలు చేయించిన టీడీపీ నాయకులు శ్రీవాణి ట్రస్ట్‌పై నిరాధారణ ఆరోపణలు చేయడం దారుణమన్నారు. టీటీడీపై విమర్శలు చేస్తే అలిపిరి బాంబు దాడి తర్వాత పదవి కోల్పోయిన చంద్రబాబు ఇకపై తిరుమల కూడా రాలేరని ధ్వజమెత్తారు. 14 ఏళ్లుగా సీఎంగా చేసిన చంద్రబాబుకు టీటీడీలో నిధులు పక్కదారి పట్టవన్న విషయం తెలియదా అని ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలన్నారు.

నవరసాల దృశ్యకావ్యం దేవదాసు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కొల్లూరి, డోగిపర్తి, అక్కినేని అభిమానులు

విజయవాడకల్చరల్: అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రి నటజీవితంలో చిరస్థాయిగా నిలిచిపోయిన చలనచిత్రం దేవదాసు అని ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి అన్నారు. దేవదాసు చిత్రం విడుదలై 70 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ, శారదా కళాసమితి, మన అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన కొల్లూరి మాట్లాడుతూ.. సావిత్రి, అక్కినేని నటన వారి జీవితంలో కొత్త పాత్రలకు జీవం పోసిందన్నారు. శారదా కళా సమితి అధ్యక్షుడు డోగిపర్తి శంకర్రావు మాట్లాడుతూ దేవదాసు చిత్రం తెలుగు సినిమా చరిత్రలో క్లాసిక్‌గా నిలిచిపోయిందన్నారు. మన అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు ఎం.రామకృష్ణ, సంస్థ లక్ష్యాలను వివరించారు. అక్కినేని అభిమాన సంఘం నాయకులు పురాణం రమణ, కేవీఎస్ సత్యనారాయణ, మిరియాల ఏడుకొండలు, సుకుమార్ రెడ్డి, జి.సూర్యనారాయణ పాల్గొన్నారు. అక్కినేని జీవిత సాఫల్య పురస్కారాన్ని జి.ప్రసాద్‌కు అందజేశారు. ఇదే ప్రాంగణంలో సాయంత్రం అక్కినేని అభిమానుల ఆత్మీయ సమావేశం, దేవదాస్ చిత్రంపై క్విజ్ పోటీ నిర్వహించారు. దేవదాసు 70 ఏళ్ల బ్రోచర్‌ను కొల్లూరితో పాటు అతిథులు ఆవిష్కరించారు.

దుర్గమ్మ సన్నిధిలో సుబ్రహ్మణ్యస్వామి వారి కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న ఆలయ అర్చకుడు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): షష్టిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శనివారం శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రమ్మణ్య స్వామి వారి ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు కల్యాణోత్సవాన్ని జరిపారు. తొలుత గణపతి పూజ, అనంతరం స్వామి వారి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిపించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు సేవలో పాల్గొన్నారు. స్వామి వారి కల్యాణం జరిపించుకున్న, వీక్షించినా వారి ఇంటిలో ఎటువంటి కష్టాలు ఉండవని, వివాహం కాని వారికి వివాహ యోగం, సంతానం లేని వారికి సంతాన భాగ్యం కలుగుతుందని, దోషాలు తొలగిపోయి ప్రశాంత జీవనం సాగిస్తారని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. స్వామి వారి కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు వేదిక వద్దకు చేరుకున్నారు. అనంతరం స్వామి ఊరేగింపు సేవలో ఉభయ దాతలు పాల్గొన్నారు.

సారె సమర్పణకు తరలివస్తున్న భక్తజనం



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు. అమ్మవారి సన్నిధిలో జరుగుతున్న ఆషాఢ మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా దుర్గగుడి పాలక మండలి సభ్యుడు చింతా సింహచలం, పలు భక్త బృందాలు శనివారం అమ్మవారికి సారెను సమర్పించాయి. పాలక మండలి సభ్యుడు చింతా సింహచలం, విజయవాడ అపరాజిత సేవా బృందంతో పాటు పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన సుమారు 600 మంది మహిళలు అమ్మవారికి సారెను సమర్పించేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేయగా, ఆలయ అధికారులు వారిని సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి సారెను సమర్పించిన భక్తులు, భక్త బృందాలకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. సారె సమర్పణ కార్యక్రమాన్ని ఆలయ ఈవో భ్రమరాంబ పర్యవేక్షించి, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అమ్మవారి దర్శనం కల్పించారు.

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలి



మీసాల రాజేశ్వరరావు వంతెన వద్ద కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యాచరణలో భాగంగా నగరపాలక సంస్థ ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్న కాలువల శుభ్రత, మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ తమ బాధ్యతగా భావించి ప్రజలంతా సహకరించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. కాలువల శుభ్రత పనుల పర్యవేక్షణలో భాగంగా ఆయన శనివారం 34వ వార్డు పరిధిలోని సీకే రోడ్డు, మీసాల రాజేశ్వరరావు వంతెన దగ్గర పరిశీలించారు. వర్షాలు కురుస్తుండటంతో కాలువలను శుభ్రంగా ఉంచాలని స్థానికులకు సూచించారు. కాలువ పక్కనే ఉన్న చెక్క పెట్టెలను అక్కడి నుంచి తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న చెత్త సేకరణ, పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. అనంతరం బందరు రోడ్డు బెంజిసర్కిల్ నుంచి పోలీస్ కంట్రోల్ రూమ్ వరకు జరుగుతున్న కారిడార్ ఫుట్‌పాత్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారిడార్ ఇంప్రూవ్‌మెంట్ ప్లాన్, ఎల్ అండ్ టీ చేసిన డిజైన్లు, యూనివర్సిల్ యాక్సిస్ కింద నగరంలోని అన్ని ప్రధాన జంక్షన్లను అభివృద్ధి పరచే విధంగా నగరపాలక సంస్థ కృషి చేస్తోందన్నారు. ఆయనతో పాటు అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, డెప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ శిరన్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణమూర్తి, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేసిన కేంద్ర బృందం



ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

పాయకాపురం(విజయవాడరూరల్): పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలపై కేంద్ర ప్రభుత్వ జాతీయ నాణ్యతా ప్రమాణాలు అంచనా బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. పాయకాపురం, కుందావారి కండ్రికలో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర బృందం కల్సర్ డాక్టర్ అజయ్‌కుమార్ సూద్, డాక్టర్ జీను, జి.థామస్‌లు శుక్ర, శనివారం రెండు రోజుల పాటు ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీపీఎంఓ డాక్టర్ నవీన్, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నరసింహ నాయక్, జిల్లా నాణ్యత బృందం కేంద్ర బృందాన్ని కలిసి ఆరోగ్య కేంద్రాలపై అందిస్తున్న సేవలను వివరించారు. తనిఖీల్లో కేంద్ర బృందంతో పాటు స్థానిక వైద్యశాల డాక్టర్ బాసిద్, ఆరోగ్య కేంద్రం సిబ్బంది, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ అప్పాజీరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రభుత్వ పథకాలకు అర్హులందరికీ అందించేందుకు అధికారులు కృషి చేయాలని కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు అన్నారు. డివిజన్ పరిధిలోని సచివాలయ సిబ్బందికి జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం స్థానిక షాదీఖానా ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పాజీరావు మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న సురక్ష పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అధికారులు దుర్గాప్రసాద్, సాయి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను అందించటమే లక్ష్యం

భవానీపురం(విజయవాడపశ్చిమ): అర్హత ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందనివారి వివరాలు, అందుకుగల కారణాలను తెలుసుకుని వాటిని సరి చేసి లబ్ధి చేకూర్చటమే జగనన్న సురక్ష కార్యక్రమ లక్ష్యమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావు తెలిపారు. 44వ డివిజన్ పరిధిలోని లేబర్‌కాలనీలోగల కమ్యూనిటీ హాల్‌లో సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు జగనన్న సురక్ష మొబైల్ యాప్‌పై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఈ యాప్ ద్వారా ప్రభుత్వం అందించే 11 రకాల సేవలను వివరించాలన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



పోస్టర్లను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని నవజీవన్ సంస్థ కోఆర్డినేటర్ సుజాత తెలిపారు. ఈ నెల 26వ తేదీన అంతర్జాతీయ మత్తు పదార్థాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని పాతబస్తీలోని సెయింట్ అంథోనీ ఆర్సీఎం స్కూల్‌లో విద్యార్థులకు అవగాహనా సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారన్నారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో పిల్లలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని కలలు కంటారన్నారు. కానీ మత్తుతో వారి జీవితాలు అంధకారంగా మారుతాయన్నారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. 'డ్రగ్ ఈజ్ ఏ డెత్ ట్రాప్' పేరుతో రూపొందించిన పోస్టర్లను ప్రదర్శిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. తొలుత నిర్వహించిన డ్రాయింగ్ పోటీల విజేతలకు బహుమతులను అందించారు.

దేవస్థానం ఆధ్వర్యంలో కొబ్బరికాయలు కొట్టే కౌంటర్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ దర్శనం అనంతరం భక్తులు కొబ్బరికాయలు కొట్టే కౌంటర్‌ను దేవస్థానం రెండు రోజుల కిందట స్వాధీనం చేసుకుంది. కొబ్బరికాయల కొట్టే కౌంటర్‌ను గతేడాది మేలో సత్య వెంకట దుర్గ ఎంటర్ ప్రైజర్స్ కాంట్రాక్టర్‌కు రూ.90 లక్షలకు దక్కించుకుంది. ఏడాది గడువు ముగియడంతో గతేడాది టెండర్ మొత్తానికి 10 శాతం పెంపుతో మరో ఏడాది పొడిగింపునకు అవకాశం ఉంది. అయితే సదరు కాంట్రాక్టర్ దేవస్థానానికి టెండర్ నిమిత్తం దేవస్థానానికి రూ.99 లక్షల వరకు చెల్లించాల్సి ఉండగా, ప్రస్తుత తన కుటుంబ పరిస్థితి, ఇతర కారణాల చేత ఆ మొత్తం చెల్లించలేనని కాంట్రాక్టర్ దేవస్థానానికి లేఖ రూపంలో తెలియజేశారు. దీంతో ఈవో భ్రమరాంబ ఆదేశాల మేరకు అధికారులు కౌంటర్‌ను స్వాధీనం చేసుకుని దేవస్థాన సిబ్బందిని నియమించారు. కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టే అవకాశాలున్నాయి. వారంలో కొత్త టెండర్లను ఆహ్వానించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

7న పేరంటాలమ్మకు శాకంబరీ అలంకరణ

రామవరప్పాడు: రామవరప్పాడు గ్రామంలోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో జూలై ఏడో తేదీన అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరిస్తున్నట్లు ఈవో పి.లోకేశ్వరి శనివారం తెలిపారు. కూరగాయలు, పండ్లు సమర్పించ దలచిన భక్తులు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.